క్లుప్తంగా

పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు శిక్షణ

సీతంపేట: మండలంలోని పాతరేగులగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం సైంటిస్ట్ లక్ష్మీనారాయణ చిరుధాన్యాల ప్రాముఖ్యత వివరించారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకూడదని సూచించారు. రిసోర్స్‌పర్సన్ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువు వల్ల భూమిలో పోషకాలు పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వి.సుదర్శనరావు, కర్రెన్న, తదితరులు పాల్గొన్నారు.

వితరణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బరాటం లక్ష్మీ ప్రకాష్.. అదే పాఠశాలకు రూ.10 వేలు విలువైన కుర్చీలను వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శంకరరావుకు వాటిని శుక్రవారం అందజేశారు. రానున్న రోజుల్లో పాఠశాలకు అవసరమైన మరిన్ని వస్తువులు సమకూరుస్తానని దాత తెలిపారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్(పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు రాయాల్సిన పరీక్ష) పరీక్షకు సంబంధించి, శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30న జరిగే పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తెలిపారు. ఉచితంగా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి: మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జీవనోపాధుల ప్రత్యేకాధికారి ఆర్‌సీ రాజు తెలిపారు. మండలంలోని పెద్దూరులో స్వయం సహాయక సంఘ మహిళలు, ఎన్యుమరేటర్లకు శిక్షణా తరగతులు శుక్రవారం నిర్వహించారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి, ఆర్థిక ప్రగతి సాధనకు చేపట్టాల్సిన ప్రణాళికలు-వాటి అమలుపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని పాలకొండ - సీతంపేట రహదారిలో స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై కె. ప్రయోగమూర్తి, సిబ్బంది వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, మద్యం మత్తులో పట్టుబడిన వారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం నూతన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో ఏఎస్సై నారాయణరావు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

వీరఘట్టం: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంఈఓ ఆర్.ఆనందరావు సూచించారు. శుక్రవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా డ్రాపౌట్ విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టి తల్లిదండ్రులతో మాట్లాడి సర్కారు బడుల విశిష్టతను వివరించాలని సూచించారు.

సారా నిర్మూలనకు సహకరించండి



బెల్లం వ్యాపారులతో సమావేశమైన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర

పాలకొండ రూరల్: బెల్ల వ్యాపారులు ఎక్సైజ్ యంత్రాంగానికి సహకరించి సారా నిర్మూలనకు కృషి చేయాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఎస్ దొర అన్నారు. శుక్రవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో బెల్లం వ్యాపారులతో సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాభాపేక్షతో సారా తయారీదారులకు సహకరించడం, వారికి నల్ల బెల్లం పెద్దెత్తున అమ్మకా లు చేయడం సరికాదన్నారు. నవోదయం కా ర్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, నిరంతర నిఘా కొనసాగుతుందని ఆ శాఖ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు.

తోటపల్లి ఆధునీకరణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

• ఎమ్మెల్సీ విక్రాంత్



జలవనరులశాఖ ఏఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునీకరణ పనులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014–19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అరకొరగా చేపట్టి వదిలేసిన తోటపల్లి పాత ఆయకట్టుకు 2019 – 24 మధ్య కాలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసిందన్నారు. అయితే ఈ కాలంలో రెండేళ్ల పాటు కరోనా ప్రభావంతో కొంతవరకు తోటపల్లి కాలువల ఆధునీకరణ పనులు ఆగిపోయాయని చెప్పారు. అయినప్పటికీ టీడీపీ ప్రభుత్వంలో చేసిన 9 శాతం పనులకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన 14 శాతం పనులకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బిల్లులు చెల్లించారని గుర్తు చేశారు. అయితే ఎన్నికల ముందు తోటపల్లి అంశాన్ని చూపి రైతులను మాయమాటలతో మోసగించి.. తీరా గెలిచాక రూ.198 కోట్లతో జరుగుతున్న తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునీకీకరణ పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం చాలా అన్యాయమన్నారు. ఓట్లు వేసిన ఆయకట్టు రైతాంగాన్ని చంద్రబాబునాయుడు సర్కారు మోసగించిందని ధ్వజమెత్తారు. పాత ఆయకట్టులోని వీరఘట్టం, పాలకొండ డివిజన్‌లలో ఎస్‌డీఎంఎఫ్ నిధులతో మంజూరైన 11 వర్క్‌లను పారదర్శకంగా చేపట్టాలని జలవనరులశాఖ ఏఈ డీవీ రమణకు సూచించారు. అనంతరం వ్యవసాయశాఖ పనితీరుపై ఏఓ సౌజన్యతో మాట్లాడారు. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన హౌసింగ్ స్కీమ్‌లో లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని హౌసింగ్ ఏఈ వినోద్‌కు సూచించారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, తహసీల్దార్ చందక సత్యనారాయణ, సర్పంచ్‌లు కర్రి రమాదేవి, సత్యవతమ్మతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మోహరించిన పోలీసులు..

ఇటీవల పాలకొండ సర్వసభ్య సమావేశంలో చోటు చేసుకున్న పరిణామాల దృష్ట్యా వీరఘట్టం మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతగా జరిపేందుకు పెద్ద ఎత్తున స్థానిక పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మండల పరిషత్ కార్యాలయం వద్ద మోహరించారు. అయితే కూటమి నాయకులు ఈ సభకు ఎవరూ హాజరు కాకపోవడంతో సభ ప్రశాంతగా జరిగింది. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

పాలవలసకు నివాళులు..



రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎంపీపీ దమలపాటి, తదితరులు

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ దివంగత పాలవలస రాజశేఖరానికి మండల పరిషత్ సభ్యులు శుక్రవారం నివాళులర్పించారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నుంచి జెడ్పీ చైర్మన్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, శాసనసభ సభ్యుడిగా, శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నో పదవులు అలంకరించి, ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన పాలవలస రాజశేఖరంను స్మరించుకోవడం మన బాధ్యతని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. ముఖ్యగా వీరఘట్టం మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించుకోవడం గొప్ప విషయమన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి గ్రామంలో గంట్యాడ సతీష్ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శుక్రవారం బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ రవణమ్మ, అల్లు ఈశ్వరరావు, బలగ వెంకటరమణ, బోనంగి కల్యాణ్, మజ్జి జగన్నాథం, వాన నారాయణరావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

19 మందిపై బైండోవర్ కేసు

వీరఘట్టం: సారా తయారీ, విక్రయాలకు సంబంధించిన 19 మంది పాత నేరస్తులపై శుక్రవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సీహెచ్ చక్రవర్తి తెలిపారు. తహసీల్దార్ చందక సత్యనారాయణ ఎదుట పాత నేరస్తులను హాజరుపరచగా.. వారిపై బైండోవర్ నమోదు చేశారని చెప్పారు. అంతకుముందు వీరఘట్టం ఎస్సీ కాలనీ, రెల్లివీధి, బీసీ కాలనీ, బల్లగుడ్డి, చిన్నగోర కాలనీల్లో నవోదయం 2.0లో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎక్సైజ్ ఎస్సై జి.గిరీష్, హెచ్‌సీ ఎస్.పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ భక్తుల పాదయాత్ర

వీరఘట్టం: పరిశుద్ధ శిలువ మార్గంతో క్రైస్తవ భక్తులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని చిట్టపులివలస విచారణతో పాటు వంగర మండలం కొప్పరవలస విచారణకు చెందిన క్రైస్తవ భక్తులు పవిత్ర శుక్రవారాన్ని పురస్కరించుకుని శిలువమార్గం నిర్వహించారు. తమ గ్రామాల నుంచి పాదయాత్రగా వెళ్లి మరియగిరి కొండపై వెలసిన మేరీమాతకు దివ్య పూజా బలి సమర్పించారు. పాదయాత్రలో ఫాదర్లు బెహరా సతీష్‌కుమార్, మరియదాసు పాల్గొన్నారు.

వర్షంతో హర్షం..

వీరఘట్టం/ పాలకొండ రూరల్: వేసవి ఎండలతో కొద్ది రోజులుగా అవస్థలు పడుతున్న ప్రజలకు అకాల వర్షం ఊరటనిచ్చింది. వీరఘట్టం, పాలకొండ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పాలకొండ రూరల్: ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి భారం మోపుతున్న ప్రభుత్వం తక్షణమే విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘ నాయకులు డి. రమణారావు, కాద రాము, తదితరులు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు అండ్ కో ఇప్పుడు చార్జీలు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. ట్రూఅప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



వక్ఫ్ సవరణ బిల్లు వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న సీపీఎం నాయకుడు గంగునాయుడు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. కురుపాంలోని జామియా మసీదు వద్ద ముస్లిం సోదరులకు కేంద్రం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నీ మతపరమైన కల్లోలాలు సృష్టించేలా నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలతో మతోన్మాద శక్తులు తలపడుతున్నాయని, ఇప్పుడు సరికొత్తగా వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందన్నారు. ఈ సవరణ బిల్లు ముస్లింలకు సంబంధించిన ఆస్తులు కబ్జా చేయడానికే తప్ప అభివృద్ధికి కాదన్నారు. రాజ్యాంగంలోని 25, 29, 30 నిబంధనలకు వ్యతిరేకంగా ఈ బిల్లు సవరించడం జరిగిందని దీనిని ఉమ్మడిగా ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకుడు పి.తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని నేరేడువలస గ్రామంలోని 10 మహిళలకు స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన కుట్టుమిషన్లను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఇంటి వద్దనే మహిళలు స్వయం ఉపాధి పొందడాన్ని ప్రోత్సహిస్తూ స్వార్డ్ సంస్థ ఇచ్చిన ఈ మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో స్వార్డ్ సంస్థ డైరెక్టర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లతో భూగర్భజలాల సంరక్షణ

జియ్యమ్మవలస రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేపట్టే ఫారంపాండ్‌ల నిర్మాణాలతో భూగర్భజలాలను సంరక్షించవచ్చని మండల ప్రత్యేకాధికారి టి.కొండలరావు సూచించారు. మండలంలోని బీజేపురంలో జరుగుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనదారులకు కూడా గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని తెలిపారు. అంతకుముందు అల్లువాడ గ్రామంలో పర్యటించిన ఆయన ఇంటింటికి వెళ్లి చేస్తున్న చెత్త సేకరణలో గ్రీన్ అంబాసిడర్ల పనితనంపై ఆరాతీశారు. గ్రామస్తుల దగ్గర నుంచి సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. తయారైన ఎరువును రైతులకు సబ్సిడీపై ఇస్తే అదనపు ఆదాయం పంచాయతీకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, ఎంపీడీవో ఎస్.రమేష్, ఏపీవో శ్రీనివాసరావు, సర్పంచ్ పర్శినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణిని సత్కరిస్తున్న గోవిందరావు

జియ్యమ్మవలస: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి కోరారు. మండలంలోని చినమేరంగి గ్రామంలో ఆమెను.. పార్టీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా నియమితుడైన పోల గోవిందరావు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి రావడంలో మీతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కృషి అభినందనీయమని, సర్వదా రుణపడి ఉంటానన్నారు. అనంతరం ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని, రానున్న రోజుల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ అనుబంధ సంస్థ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ నాయుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని.. గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పారిశుధ్య నిర్వహణలో విశేష కృషి చేస్తున్న కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తోందని ఆరోపించారు. గతంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ధర్నాలో పలు సంఘాల నుంచి కె. గంగునాయుడు, సీహెచ్ సంజీవి, పి. వేణు, సురేష్, శ్రీదేవి, విమల, రఘు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా డ్రైడే నిర్వహించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారిణి మణి

కొమరాడ: పక్కాగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణ అధికారిణి మణి సూచించారు. మండలంలోని గంగారేగువలస, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె శుక్రవారం సందర్శించారు. అనంతరం మలేరియా వ్యాప్తి నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దోమల కారణంగానే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు సోకుతాయని, అనవసర నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందుతాయని అవి పెరగకుండా చూడాలన్నారు. అనంతరం ఆస్పత్రి పరిధిలోని లెప్రసీ రోగులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ, వైద్యాధికారి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వేతనదారులకు సూచనలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహనరావు

కొమరాడ: వేసవి దృష్ట్యా ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్దకు ఆయన శుక్రవారం వెళ్లి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఎండలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయని, శరీరంలోని నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఎండలకు వడదెబ్బకు గురికాకుండా తరచూ నీటిని తాగాలని, చల్లని వేళల్లోనే పనులు చేసుకోవాలని, పనిప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

‘ఈ-శ్రమ్’లో పేర్లు నమోదు చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: అసంఘటిత కార్మికులంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పార్వతీపురం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని తాటిశీల గ్రామంలో ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావడం వల్ల వచ్చే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సామాజిక భద్రతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ-శ్రమ్ పథకంలో అందరూ చేరాలని ఆయన తెలిపారు. వ్యవసాయ కూలీలు, ఆశ కార్యకర్తలు, దుకాణాల్లో పనిచేసే వారు, తోపుడుబండ్ల వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు ఇలా అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హులైన వారంతా ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సు, ఫోన్ నంబర్‌తో పోస్టాఫీసుకు గానీ మీసేవా కేంద్రానికి గానీ ఏదైనా నెట్ సెంటర్‌కు గానీ వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

పాలకొండ రూరల్: మండలంలోని బుక్కూరు గ్రామానికి చెందిన తురక సత్యం ఫిర్యాదు మేరకు ఆయన భార్య పద్మ, ఆమె తల్లితండ్రులు, కుటుంబ సభ్యులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నారాయణరావు తెలిపారు. బాధితుడు తన ఇంట్లో కూలర్ కొనే విషయమై భార్య పద్మతో గురువారం ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో రాజాం మండలం సోపేరుకు చెందిన అత్తింటి వారు (భార్య పద్మ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు) వచ్చి వచ్చి సత్యంను గాయపరిచారు. తలపై గాయం కావడంతో సత్యం పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. అక్కడి వైద్యులు అందించిన సమాచారం మేరకు ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సక్రమంగా రీ సర్వే..

• తహసీల్దార్ బాలమురళీకృష్ణ



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

పాలకొండ: గ్రామాల్లో చేపడుతున్న భూముల రీ సర్వే సక్రమంగా పూర్తి చేయాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ అన్నారు. మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లతో శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల సమక్షంలో సర్వే పూర్తి చేయాలని తెలిపారు. రికార్డుల ప్రకారం సర్వే చేసి ఆన్‌లైన్ చేయాలని సూచించారు. రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

పిల్లల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

• జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి శ్రీధర్



సమావేశం నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కమిటీ సభ్యులు

పాలకొండ/పాలకొండ రూరల్: పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి పి. శ్రీధర్ అన్నారు. పట్టణంలోని 20 వార్డు పరిధిలో బాలల సంరక్షణ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలలపై లైంగిక దాడులు జరగకుండా కమిటీ పనిచేయాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మహిళా సంరక్షణ అధికారి ప్రమీల, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎన్‌జీఓ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మకు ఆభరణాలు..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు విశాఖపట్నానికి చెందిన సాయికుమార్ దంపతులు బంగారు ఆభరణాలు సమకూర్చారు. 26 గ్రాములతో తయారు చేసిన పుస్తుల తాడు, రెండు మంగళసూత్రాలను ఆలయ ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్‌శర్మకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. – పాలకొండ

మంచినీళ్ల ట్యాంక్ ఏర్పాటు..

వీరఘట్టం మండలంలోని తలవరం ఎస్సీ కాలనీలో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీళ్ల ట్యాంక్‌ను సర్పంచ్ శిష్టు మధుసూదనరావు శుక్రవారం ప్రారంభించారు. చాలా రోజులుగా ఎస్సీ కాలనీలో ఉన్న 100 కుటుంబాలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతుండడంతో.. రక్షిత మంచినీటిని అందించేందుకు ఈ ట్యాంక్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చందక వెంకటరావు, సత్తిబాబు, తమరాపు లక్ష్మణరావు, వండాన సాయికిరణ్ పాల్గొన్నారు. – వీరఘట్టం



అలరించిన చిన్నారుల నృత్యాలు



భామిని మండలం నేరడి - బి ఎంపీయూపీ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో చిన్నారుల నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు సందడిగా గడిపారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. – భామిని

హడలెత్తిస్తున్న ఏనుగులు

మండలంలోని నేరడి-బిలోని పంట పొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తూ రైతులను హడలెత్తిస్తున్నాయి. మొక్కజొన్న, నువ్వు పంటను పూర్తిగా నాశనం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏనుగుల సంచారంతో పొలానికి వెళ్లేందుకు భయపడుతున్నారు. భామిని

